క్లుప్తంగా

రేషన్ పంపిణీకి అత్యాధునిక మిషన్లు



వీపీ - 21 ఈపాస్ మిషన్

కర్నూలు(సెంట్రల్): ఆగస్టు 26 నుంచి ప్రారంభమయ్యే రేషన్ సరుకుల పంపిణీని నవీకరించబడిన వీపీ - 21 ఈపాస్ మిషన్ ద్వారా ప్రజలకు సరుకులు ఇవ్వాలని డీఎస్ఓ రాజారఘువీర్ సూచించారు. సోమవారం డీఎస్ఓ కార్యాలయంలో నవీకరించిన వీపీ - 21 ఈపాస్ మిషన్ వినియోగంపై కర్నూలులోని 170 మంది రేషన్ డీలర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత ఈపాస్ మిషన్ స్థానంలో కొత్తగా వచ్చిన వీపీ - 21 మిషన్లను వినియోగించాలన్నారు. ఈ మిషన్‌లు క్యూఆర్ కోడ్‌తో పనిచేస్తాయని, 5జీ కనెక్టివిటీతో సిగ్నల్ స్ట్రెంత్ మెరుగుపడి వేగంగా ట్రాన్సాక్షన్‌లు జరుగుతాయని చెప్పారు. త్వరలో దీని ద్వారానే ఆన్‌లైన్ చెల్లింపు చేసే అవకాశం కూడా ఉంటుందని వివరించారు. ఏఎస్ఓ వెంకటరాజు పాల్గొన్నారు.

ఉల్లి దిగుబడులను ఎప్పటికప్పుడు కొనాలి



వ్యాపారులకు సూచనలు చేస్తున్న జేసీ నవ్య

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు మార్కెట్‌కు వచ్చిన ఉల్లి దిగుబడులను ఏ రోజుకారోజు విధిగా కొనుగోలు చేయాలని జాయింట్ కలెక్టర్ నవ్య వ్యాపారులను ఆదేశించారు. సోమవారం మార్కెట్‌కు ఉల్లి వెల్లువెత్తడం, వ్యాపారులు కొనుగోలు చేసేందుకు ముందుకు రాని నేపథ్యంలో జేసీ సాయంత్రం మార్కెట్ యార్డును సందర్శించారు. వ్యాపారులతో సమావేశం నిర్వహించి ఉల్లి కొనుగోళ్లపై సూచనలు చేశారు. ఈ సారి ఉల్లి సాగు ఎక్కువగా ఉందని.. ఇప్పటికే మార్కెట్‌కు ఉల్లి తాకిడి మొదలైందని, రానున్న రోజుల్లో మరింత భారీగా వచ్చే అవకాశం ఉందన్నారు. మార్కెట్‌కు ఏ రోజు వచ్చిన ఉల్లిని ఆదే రోజు కొనుగోలు చేయాలని వ్యాపారులను ఆదేశించారు. ఉల్లి నాణ్యతను బట్టి గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలన్నారు. రైతులకు నష్టం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సెక్రటరీ జయలక్ష్మి, వ్యాపారులు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన పథకాలు ప్రజలకు చేరువచేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ సూచించారు. ఆమె సోమవారం తన ఛాంబర్‌లో ప్రోగ్రామ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును పర్యవేక్షించి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఆక్రమణలు తొలగించండి



కమిషనర్‌కు సమస్యలు తెలియజేస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): బాబు జగ్జీవన్‌రామ్ నగర్‌లో నిర్మాణంలో ఉన్న డ్రైనేజీ కాల్వను ఆక్రమించి ఏర్పాటు చేసిన గుడిసెలను తొలగించాలని స్థానికులు విన్నవించారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ పి.విశ్వనాథ్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

ఫిర్యాదులు ఇవే..

- కల్లూరు చెన్నమ్మ సర్కిల్ సమీపంలోని పంచరత్న కాలనీలో సీసీ రహదారి, డ్రైనేజీ నిర్మించాలని స్థానికులు అభ్యర్థించారు.
- కళావతి నగర్, షిరిడీ సాయి నగర్, రమ్యనగర్, శివప్రియ నగర్ ప్రాంతాల్లో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు విన్నవించారు.
- 19వ వార్డు చంద్రశేఖర్ కాలనీలో డ్రైనేజీ కాల్వలు నిర్మించాలని స్థానికులు శ్రీనివాసరావు వినతిపత్రం అందజేశారు.

కర్నూలు (టౌన్): స్థానిక వెంకటరమణ కాలనీ, బాలాజీ నగర్, రామలింగేశ్వర్ నగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను కమిషనర్ పి.విశ్వనాథ్ సోమవారం పరిశీలించారు. కాలనీ వాసులతో మాట్లాడారు. పారిశుద్ధ్య పనులు పక్కాగా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.

పరిశ్రమల్లో యూరియా వినియోగంపై తనిఖీలు

కర్నూలు (అగ్రికల్చర్): వ్యవసాయేతర అవసరాలకు యూరియా వినియోగిస్తున్నారా? అనేదానిపై జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా నియమించిన ప్రత్యేక బృందం తనిఖీలను ముమ్మరం చేసింది. జిల్లా పౌర సరఫరాల అధికారి రాజా రఘువీర్, వివిధ శాఖల అధికారులు కల్లూరు మండలంలో వివిధ పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించారు. మొత్తం 21 పరిశ్రమల్లో తనిఖీ చేయగా ఎక్కడా యూరియా వినియోగం లేదనే విషయం స్పష్టమైంది. దీంతో జిల్లాకు వచ్చిన యూరియా పక్కదారి పట్టిందనే విమర్శలకు బలం చేకూరినట్లు అయ్యింది.

నగర అవినీతి పాలనపై గరం.. గరం

- కర్నూలు సరే.. కల్లూరు కాలనీల అభివృద్ధి పట్టదా?
- రెవెన్యూలో అవినీతి, ఇంజినీరింగ్‌లో నిర్లక్ష్యంపై సభ్యుల ధ్వజం
- 15 అంశాలు, రూ.4.06 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం
- వాడీవేడిగా నగరపాలక సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న మేయర్ బీవై రామయ్య



సమావేశానికి హాజరైన పాలకవర్గం సభ్యులు

కర్నూలు (టౌన్): కర్నూలు నగరపాలక సంస్థ అవినీతి పాలనపై పాలక, ప్రతిపక్ష పార్టీల సభ్యులు ధ్వజమెత్తారు. ఏడాది కాలంగా పనులు సాగడం లేదు. ఏళ్ల తరబడి పనులు చేయడం లేదు. అసలు సచివాలయాల వ్యవస్థ ఉందా? ఉద్యోగులు పనిచేస్తున్నారా? అంటూ కౌన్సిల్ సభ్యులు మండిపడ్డారు. పాలన దారి తప్పిందని విమర్శిస్తూ అధికారులతో వాగ్వివాదానికి దిగారు. ఇంకెన్ని రోజులు.. అధికారులు మారరా? అంటూ తీవ్ర స్థాయిలో విస్మయం వ్యక్తం చేశారు. ఈనెల 2న వాయిదా పడిన సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నగర మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన నిర్వహించారు. వాడీవేడిగా జరిగిన సమావేశంలో ముందుగా మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. నగర ప్రజల భాగస్వామ్యంతో కర్నూలును అన్ని విధాలుగా అభివృద్ధి చేద్దామని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, కమిషనర్ పి. విశ్వనాథ్, డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అధ్వానంగా రెవెన్యూ, ఇంజినీరింగ్ పనితీరు

రెవెన్యూ విభాగంలో పనితీరు అధ్వానంగా ఉందని సభ్యులు ధ్వజమెత్తారు. టైటిల్ ట్రాన్స్‌ఫర్ పనులు నెల రోజులైనా కావడం లేదన్నారు. చిల్డ్రన్ పార్కులో మూడు షాపులకు అనుమతి ఇస్తే అక్కడ పాలకవర్గం అనుమతి లేకుండా 14 షాపులు వెలిశాయన్నారు. ఆ డబ్బులు ఎవరికి పోతున్నాయని ప్రశ్నించారు. పార్కింగ్ స్థలాల్లో అనధికారికంగా షాపులు ఏర్పాటు చేసి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. నగరపాలక సంస్థకు ఆదాయం రాకుండా ఎవరికి వెళుతున్నాయని కో-ఆప్షన్ సభ్యులు నయీం, కార్పొరేటర్లు షేక్ అహమ్మద్, క్రాంతికుమార్ ప్రశ్నించారు. అలాగే ఇంజినీరింగ్ విభాగంలో పనులు కావడం లేదని ఏళ్ల తరబడి టెండర్లు నిర్వహించినా పనులు మాత్రం జరగడం లేదన్నారు. ఉన్నతాధికారులు పనిచేయడం లేదని ఆరోపించారు. మొట్టమొదటి కౌన్సిల్ నుంచి అడుగుతున్నా ఇప్పటివరకు పనులు ఎందుకు చేయలేదని స్టాండింగ్ కమిటీ సభ్యులు సాంబశివరావు ప్రశ్నించారు.

కల్లూరు కాలనీలను పట్టించుకోరా?

కార్పొరేషన్ అధికారులకు కర్నూలు మాత్రమే కనిపిస్తుందా? కల్లూరు కాలనీల అభివృద్ధి పట్టదా? అని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ప్రశ్నించారు. జనాభా ఆధారంగా నిధులు కేటాయించాలని, అందుకు విరుద్ధంగా నగరపాలక అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. కర్నూలుకు రూ.50 కోట్లు, కల్లూరుకు రూ.24 కోట్లు మాత్రమే కేటాయించారు. అత్యధికంగా పన్నులు తమ ప్రాంతం నుంచే వస్తున్నాయి. నంద్యాల చెక్‌పోస్టు నుంచి వంద అడుగుల రోడ్డు వేయాలని ఇప్పటికే ఎన్నో సార్లు చెప్పా.. పోలవరం పూర్తవుతుందేమో కానీ, ఇక్కడ రోడ్డు మాత్రం వేయరా? అని ప్రశ్నించారు.

15 తీర్మానాలు - రూ.4.06 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం

నగరపాలక సర్వసభ్య సమావేశంలో 15 తీర్మానాలను పాలక వర్గం సభ్యులు ఆమోదించారు. రూ.4.06 కోట్లు విలువ చేసే పలు అభివృద్ధి పనులకు ఆమోదం వ్యక్తం చేశారు. సమావేశంలో కమిషనర్ పి.విశ్వనాథ్ మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, అవినీతి అక్రమాలపై విచారణ చేయించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. టెండర్లలో పాల్గొని అగ్రిమెంటు చేసుకొని పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెడతామని హెచ్చరించారు.

ఆమోదించిన తీర్మానాలు

- 25వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో రూ.45 లక్షలతో పైపులైన్ నిర్మాణం
- 43వ వార్డులో రూ.27 లక్షలతో సీసీ డ్రైన్లు, సీసీ రహదారులు
- 44వ వార్డులో రూ.44 లక్షలతో వీనస్ కాలనీలో పార్కు అభివృద్ధి
- 45వ వార్డు వెంకటరమణ కాలనీ, ప్రేమ్ నగర్‌లో రూ.49 లక్షలతో సీసీ రహదారి, డ్రైన్
- జొహరాపురం డంప్ యార్డు నుంచి ఇందిరమ్మ కాలనీ వరకు రూ.26 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం
- 25వ వార్డు దేవనగర్‌లో రూ.15 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణం
- 38వ వార్డు సమతా నగర్, సాయి నగర్‌లో రూ.54.50 లక్షలతో సీసీ డ్రైన్
- 39వ వార్డు అంబేడ్కర్ కాలనీలో రూ.42 లక్షలతో సీసీ డ్రైన్, రహదారి పనులు
- 40వ వార్డు లక్ష్మణ్ సింగ్ కాలనీ, మమతా నగర్‌లో రూ. 47.50 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం

కార్పొరేటర్లు ఏమన్నారంటే..

- కర్నూలును చెత్త నగరంగా చేశారని స్వయాన కలెక్టర్ రంజిత్ బాషా హెచ్చరించినా పారిశుద్ధ్య విభాగం పనితీరు మారడం లేదని కార్పొరేటర్ విక్రమసింహా రెడ్డి ధ్వజమెత్తారు.
- చిరంజీవి పార్కు, ప్రకాష్ నగర్‌లో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా గ్రీన్ జోన్ ప్రాంతంలో వీధి వ్యాపారులకు అవకాశం కల్పించాలని 49వ వార్డు కార్పొరేటర్ క్రిష్ణకాంత్ రెడ్డి కోరారు.
- వీధి కుక్కల సమస్య తీవ్రంగా ఉందని, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని 46వ వార్డు కార్పొరేటర్ నగరూరు శ్రీనివాసరావు కోరారు.
- డాక్టర్స్ కాలనీలో పానీపూరి వ్యాపారులు వ్యర్థాలను అక్కడే వదిలేస్తూ అపరిశుభ్రంగా మారుస్తున్నారని 21వ వార్డు కార్పొరేటర్ వి.అరుణ చెప్పారు.
- చెన్నమ్మ సర్కిల్ నుంచి లక్ష్మీపురం వైపు వెళ్లే రోడ్డులో డివైడర్లు ఏర్పాటు చేయాలని స్టాండింగ్ కమిటీ సభ్యుడు నారాయణ రెడ్డి కోరారు.
- గుత్తి పెట్రోల్ బంకు వద్ద పార్కింగ్ స్థలాల్లో అనధికారికంగా వ్యాపారాలకు అనుమతులిచ్చి సొమ్ము చేసుకుంటున్నారని 29వ వార్డు కార్పొరేటర్ సుదర్శన్ రెడ్డి ఫిర్యాదు చేశారు.
- జమ్మిచెట్టు వద్ద నిరుపయోగంగా మారిన ఎస్‌టీపీ, సలాంఖాన్ సర్కిల్‌ను అభివృద్ధి చేయాలని 7వ వార్డు కార్పొరేటర్ జుబేర్ పేర్కొన్నారు.
- చిల్డ్రన్స్ పార్కు వద్ద అనధికారికంగా గోడను కూల్చేసి షాపులు ఏర్పాటు చేసినా కార్పొరేషన్ అధికారులకు కనిపించదా అని కార్పొరేటర్ క్రాంతికుమార్ ప్రశ్నించారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): వినాయక చవితి, నిమజ్జనం కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సబ్‌స్టేషన్లు, లైన్లలో అభివృద్ధి పనులు చేపడుతున్నందున మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కర్నూలు అర్బన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. శ్రీనివాస నగర్, పెద్ద మార్కెట్, బి.క్యాంప్, సి.క్యాంప్, వెంకటరమణ కాలనీ, అశోక్ నగర్, సీతారాం నగర్, బాబా బృందావన్ నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వెల్లడించారు.

మానసిక ఆరోగ్య విభాగం తనిఖీ



విశ్వభారతి హాస్పిటల్‌లో తనిఖీ చేస్తున్న జడ్జి లీలా వెంకటశేషాద్రి

కర్నూలు: గూడూరు మండలం పెంచికలపాడు గ్రామ శివారులోని విశ్వభారతి జనరల్ హాస్పిటల్‌లోని మానసిక దివ్యాంగుల విభాగాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి తనిఖీ చేశారు. సోమవారం ఆయన ఆసుపత్రికి చేరుకుని మానసిక దివ్యాంగుల సంక్షేమం కొరకు, వారికి న్యాయ సహాయం అందించేందుకు ఎల్ఎస్‌యూఎం కంపెనీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వార్డులోని మానసిక దివ్యాంగులను కలిసి వారితో మాట్లాడి న్యాయపరమైన హక్కుల గురించి తెలియజేశారు. లీగల్ సర్వీసెస్ యూనిట్ ఫర్ మనో న్యాయ్ సభ్యులు సంబంధిత ఫోన్ నంబర్లతో ఏర్పాటు చేసిన బోర్డును ఆవిష్కరించారు. మానసిక దివ్యాంగులు బోర్డులోని నంబర్లకు ఫోన్‌చేస్తే న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. దివ్యాంగుల ఆరోగ్య సంరక్షణ గురించి, వారికి అందుతున్న ఆహార వైద్య సదుపాయాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ మహేంద్రకుమార్, శివశంకర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యం పెంచుకోవాలి



హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు



మాట్లాడుతున్న ఆమ్‌డాక్స్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఇఎస్ చక్రవర్తి

కర్నూలు (సిటీ): నగరంలోని జి.పుల్లయ్య, రవీంద్ర మహిళా ఇంజినీరింగ్ కళాశాలలు సంయుక్తంగా నిర్వహించిన ప్రథమ బీటెక్, ఎంబీఏ ఓరియంటేషన్ ప్రోగ్రాం సోమవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా ఆమ్‌డాక్స్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఈఎస్ చక్రవర్తి హాజరై ప్రసంగించారు. ఇంజినీరింగ్ విద్యలోని అన్ని బ్రాంచీల విలీనం సరికొత్త ఆవిష్కరణలకు తెర తీస్తుందన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యం పెంచుకోవాలన్నారు. కళాశాల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు అసాధ్యాలను సైతం నైపుణ్యంతో ఛేదించగలరన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో సామాన్య ప్రజానీకానికి చేరువయ్యే విప్లవాత్మక మార్పులు తీసుకురావాలన్నారు. చైర్మన్ జీవీఎం మోహన్ కుమార్ మాట్లాడుతూ.. చదువుతో పాటు పరిశోధనలపై దృష్టి సారించే వారికి మంచి అవకాశాలు ఉంటాయన్నారు. సీఈఓలు జి.గోపీనాథ్, జి.వంశీధర్, ప్రిన్సిపాళ్లు సి.శ్రీనివాసరావు, డాక్టర్ కేఈ శ్రీనివాసమూర్తి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధ్యక్షతన నిర్వహించి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. జేసీ బి.నవ్య, డీఆర్వో వెంకటనారాయణమ్మ, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వర్లు, చిరంజీవి పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని....

- జిల్లాలో సిమెంట్ రేకుల షెడ్లలో పాఠశాలను నిర్వహిస్తూ ఎలాంటి అనుమతులు పొందకుండా నిర్లక్ష్యం వహిస్తున్న గ్లోబల్ జీనియస్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని, వారికి వత్తాసు పలుకుతున్న డీఈఓపై విచారణ చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్, జిల్లా నాయకులు వంశీ వినతిపత్రం ఇచ్చారు.
- ఉల్చాలలో పనిచేస్తున్న ఏడుగురు స్వచ్ఛభారత్ కార్మికులు, ఐదుగురు వాటర్ లైన్‌మన్‌లకు పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ నాయకులు విన్నవించారు.
- కర్నూలు డీఈఓ శామ్యూల్‌పాల్ విద్యార్హత విచారణ చేయాలని కోరుతూ ఏబీవీపీ కర్నూలు విభాగ కన్వీనరు గేటు ఎర్రిస్వామి వినతిపత్రం ఇచ్చారు.
- చనుగొండ్లకు చెందిన మద్దిలేటి కూతురు రాజేశ్వరి పూర్తిగా మానసిక వికలాంగురాలు. ఆమె పెన్షన్‌ను ఇటీవల అధికారులు తొలగించడంతో పునరుద్ధరించాలని కోరుతూ కలెక్టర్‌కు విన్నవించారు.
- జగన్నాథగట్టుపై జర్నలిస్టులకు ఇచ్చిన స్థలాలకు రక్షణ కల్పించాలని, మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ ఏపీజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, సాయికుమార్‌నాయుడు విన్నవించారు.
- నేత్రదానం చేసి అంధత్వ నివారణకు సహకరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. మరణించిన వారి నేత్రాలను 6 గంటల్లోపు కుటుంబసభ్యులు దానం చేయడం ద్వారా అంధుల జీవితాల్లో వెలుగు నింపవచ్చన్నారు.
- ఇటీవల ఝార్ఖండ్‌లో జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన ఎస్ఎండీ వలి, కౌశిక్, ఆరిఫ్‌బాషా, టి.ప్రణీత, జె.సాయి పల్లవి, అనిత, ఎం.శ్రావణి 2, 3, 4 స్థానాల్లో నిలవడంతో కలెక్టర్ అభినందించారు.

దండాలయ్యా.. మట్టి గణపయ్యా

కర్నూలు కల్చరల్: వినాయక చవితి వచ్చిందంటే విభిన్న రకాల వినాయక విగ్రహాల తయారీ, కొనుగోళ్లతో సందడిగా ఉంటుంది. కర్నూలుతో పాటు ఇతర పట్టణాలు, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో సుమారు 15 వేల వరకు పెద్ద విగ్రహాలు ఏర్పాటు చేస్తారు. గృహాల్లో సుమారు లక్ష చిన్న విగ్రహాలను పూజిస్తారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, కెమికల్స్‌తో తయారు చేసిన విగ్రహాలతో పర్యావరణానికి ముప్పు కలుగుతుంది. దీన్ని నివారించేందుకు కొన్ని సంస్థలు మట్టితో తయారు చేసిన విగ్రహాలను పూజించాలని ప్రజలను చైతన్య పరుస్తున్నాయి. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వివేకానంద స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో విద్యార్థులు గత పదేళ్లుగా మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ నెల 26న వినాయక్ ఘాట్‌లో విగ్రహాలను పంపిణీ చేయనున్నారు.

250 విగ్రహాలతో మొదలు

అసోసియేట్ ప్రొఫెసర్ నాగఫణి శాస్త్రి మార్గదర్శనంలో విద్యార్థులు శశికిరణ్, అబ్దుల్ రహీం, సిద్ధార్థ, పునీత్ దత్త, మన్విత, ప్రణీత, తేజ సింహారెడ్డి, వెంకట్, నిఖేత్ శ్రీరామ్, మనోహర్, లక్ష్మీనరసింహ, గోవర్ధన్ తదితరులు మట్టి వినాయక విగ్రహాలను తయారు చేశారు. మొదటి సంవత్సరం 250 విగ్రహాలతో మొదలుపెట్టి ప్రస్తుతం సుమారు వెయ్యి విగ్రహాలను పంపిణీ చేయనున్నారు.

మంత్రుల సమావేశం రద్దు

కర్నూలు (సెంట్రల్): జిల్లా, మండలాలు, గ్రామాల పేర్లు, సరిహద్దుల మార్పులకు సంబంధించి ఈనెల 29వ తేదీన కర్నూలు నగరంలో నిర్వహించనున్న మంత్రుల సమావేశం రద్దైనట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు.

ఉల్లికి గిట్టుబాటు ధర కల్పించాలి

కర్నూలు(అగ్రికల్చర్): అన్నదాతలు పండించిన ఉల్లి క్వింటాల్‌కు రూ.2 వేలు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా డిమాండ్ చేశారు. సోమవారం వారు వేర్వేరు సమయాల్లో కర్నూలు మార్కెట్ యార్డును సందర్శించి ఉల్లి రైతులను పరామర్శించారు. క్వింటాల్ ఉల్లిని రూ.500కే కొనుగోలు చేస్తుండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేత్రదానం పవిత్రమైన బాధ్యత

కర్నూలు(హాస్పిటల్): నేత్రదానాన్ని ప్రతి ఒక్కరూ పవిత్రమైన బాధ్యతగా భావించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. సోమవారం ఆయన తన ఛాంబర్‌లో జాతీయ నేత్రదాన పక్షోత్సవాల అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. నేత్రదానం వల్ల మరో ఇద్దరికి చూపు ప్రసాదించిన వారవుతారని తెలిపారు. మరణించిన వ్యక్తి సమాచారాన్ని ఆరు గంటలలోపు సమీపంలోని కంటి సేకరణ కేంద్రానికి తెలియజేస్తే వైద్య సిబ్బంది వచ్చి నేత్రాలను సేకరిస్తారని చెప్పారు.

చవితి వేడుక.. ఆధ్యాత్మిక వేదిక

- వినాయక చవితి సంబరాలకు సిద్ధమవుతున్న ప్రజలు
- ఊపందుకున్న మండపాల ఏర్పాటు
- సాంప్రదాయంతో పాటు నిబంధనలు తప్పనిసరి
- సెప్టెంబర్ 4న వినాయక శోభాయాత్ర, నిమజ్జనోత్సవం



కొలువుదీరనున్న వినాయకుడు

కర్నూలు కల్చరల్: విఘ్నాలు తొలగించే వినాయక చవితి వచ్చేసింది. ఊరూ వాడా వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. సాంప్రదాయాల తొలి పండగను అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో జరుపుకునేందుకు ప్రజలందరూ సిద్ధమయ్యారు. ఈ నెల 27న బొజ్జ గణపయ్య కొలువుదీరనున్నాడు. జిల్లావ్యాప్తంగా సుమారు 12 వేల విగ్రహాలు, కర్నూలు నగరంలో 2600 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. ఉత్సవ కమిటీలు వినాయక మండపాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. తొమ్మిది రోజుల పాటు జరిగే వేడుకల్లో లక్షలాది మంది భక్తులు పాల్గొననున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో భక్తితో పాటు భద్రతా ముఖ్యం. ప్రమాదాలు జరగకుండా గణేశ్ మండపాల ఏర్పాటు, ఉత్సవాల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం చాలా ఉంది. అడుగడుగునా ప్రమాదాలు పొంచి ఉంటాయి. అనుక్షణం అప్రమత్తత అవసరం. ప్రమాద రహిత వినాయక చవితి వేడుకలను నిర్వహించుకోడానికి గణేశ్ ఉత్సవ కేంద్ర సమితి, విద్యుత్, అగ్నిమాపక శాఖ అధికారులు ఇచ్చే సలహాలు, సూచనలు పాటించాల్సిన బాధ్యత స్థానిక మండపాల నిర్వాహకులపై ఉంది.

సందడిగా జరుపుకోవాలి



గణపతి నవరాత్రి ఉత్సవాలను అన్ని వర్గాల ప్రజలు సందడిగా జరుపుకోవాలి. నిర్వాహకులు వినాయక మండపాల ఏర్పాటులో భద్రతా ప్రమాణాలు పాటించాలి. సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా మండపాలను తీర్చిదిద్దుకోవాలి. మండలపాల వద్ద మద్యం సేవించడం, జూదమాడటం లాంటి అసాంఘిక చర్యలకు పాల్పడరాదు. నిర్వాహకులు, వలంటీర్లు మండపాల వద్ద ఆధ్యాత్మిక భావన పెంపొందేలా మసలుకోవాలి. పండగ పవిత్రతను కాపాడుకుంటూ హిందూధర్మ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

– గోరంట్ల రమణ. జిల్లా ప్రధాన కార్యదర్శి, గణేష్ మహోత్సవ కేంద్ర సమితి

ఎక్సెల్ అకాడమీ ప్రభంజనం



మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థులతో డైరెక్టర్, ప్రిన్సిపాల్, హెచ్ఓడీలు

కర్నూలు సిటీ: నీట్ పరీక్షకు అత్యున్నత శిక్షణ ఇస్తున్న ఎక్సెల్ అకాడమీ మెడికల్ సీట్ల సాధనలో ప్రభంజనం సృష్టించినట్లు డైరెక్టర్లు టి.చంద్రశేఖర్, గోపినాథ్, రాఘవేంద్ర తెలిపారు. సోమవారం ఆ అకాడమీలో ఏర్పాటు చేసిన సక్సెస్‌మీట్‌లో వారు మాట్లాడుతూ.. ఉత్తమ బోధన, అధ్యాపక బృందంతో నిత్య పర్యవేక్షణ చేస్తూ ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని శిక్షణ ఇచ్చామన్నారు. ప్రతి అంశాన్ని విశ్లేషిస్తూ చేస్తూ బోధన చేయడం జరిగిందన్నారు. తమ అకాడమీలో శిక్షణ పొందిన 16 మంది విద్యార్థులు మెడికల్ సీట్లు సాధించడం సంతోషంగా ఉందన్నారు. అలాగే తమ విద్యార్థులు అనేకమంది ఇంజినీరింగ్ సీట్లు సాధించినట్లు చెప్పారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి వారి నైపుణ్యాలపై ఎప్పటికప్పుడు తల్లిదండ్రులతో మాట్లాడి సరైన ప్రోత్సాహం, తగిన రీతిలో శిక్షణ ఇవ్వడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధ్యమయ్యాయన్నారు. అనంతరం మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థులను అభినందించారు. అకాడమీ నిర్వాహకులు డీఎస్ కన్నా, సీఎస్ కన్నా, ఈఎస్ భోగేంద్రనాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జె.రాజేష్, అధ్యపకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

కర్నూలు: నగర శివారులోని డోన్ రోడ్డులో పిస్తా హౌస్ ముందు జరిగిన రోడ్డు ప్రమాదంలో భాగ్యమ్మ (56) తీవ్ర గాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతిచెందింది. ఈమె మాంటిస్సోరి ఇండస్ స్కూల్ వద్ద ఉన్న ఆర్ఎస్ రెడ్డి నగర్‌లో నివాసముంది. గుత్తి రోడ్డులోని ఆహా హోటల్‌లో పనిచేస్తోంది. ఆదివారం పనికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా కోలుకోలేక సోమవారం మధ్యాహ్నం మృతిచెందింది. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు (హాస్పిటల్): కాళ్లకు సోకిన వెరికోసిల్ వెయిన్స్ అనే వ్యాధితో బాధ పడుతూ తాళలేక అంగడి శివకుమార్ (37) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పత్తికొండకు చెందిన ఈయనకు ఆదోనికి చెందిన శ్వేతతో వివాహమైంది. వీరు కర్నూలు, మద్దూర్ నగర్‌లో నివాసముంటున్నారు. శివకుమార్ మూడేళ్లుగా వెరికోసిల్ వెయిన్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. రెండు కాళ్లకు సమస్య ఉండటంతో నడవలేకపోతూ జీవితంపై విరక్తి చెంది ఈ నెల 22న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. ఆ ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో ఇరుగుపొరుగు వారు అతని భార్యకు సమాచారమిచ్చారు. ఆమె సోమవారం ఇంటికి వచ్చి చూడగా భర్త ఉరికి వేలాడుతూ నిర్జీవంగా కనిపించాడు.ఆమె స్థానిక మూడో పట్టణ పోలీసులకు సమాచారమివ్వడంతో కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

రైలు కింద పడి బలవన్మరణం

కర్నూలు: కర్నూలు శివారులోని లాల్‌బహదూర్ శాస్త్రి నగర్‌లో నివాసముంటున్న నరేష్ కుమార్ (45) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను డ్రైవర్‌గా పనిచేసేవాడు. కొద్ది రోజులు హోటల్ నిర్వహించాడు. అనారోగ్యంతో కొన్నాళ్ల నుంచి హోటల్ మూసేశాడు. దీంతో ఆర్థిక సమస్యలు చుట్టుముట్టి తీవ్ర మనస్థాపానికి గురై సోమవారం తుంగభద్ర నది సమీపంలో కర్నూలు నుంచి అలంపూర్ వైపు వెళ్లే రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కర్నూలు(సెంట్రల్): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6400 కోట్లను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాయిఉదయ్, రంగప్ప డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సోమవారం చేపట్టిన చలో కలెక్టరేట్ ఉద్రిక్తతంగా మారింది. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు.విద్యారంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

28న హాకీ పోటీలు

కర్నూలు (టౌన్): జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 28న స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో అంతర్ పాఠశాలల బాలబాలికల హాకీ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా హాకీ సంఘం కార్యదర్శి దాసరి సుధీర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన జట్లు పేర్ల నమోదుకు 79890 43764 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.